# సాక్షి
# సూర్యాపేట

సోమవారం। 1 । ఏప్రిల్ । 2024






**యాదాద్రిలో భక్తుల రద్దీ**

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది.

- 8లో



**.. దేశాభివృద్ధికి మలుపు**

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం దేశాభివృద్ధికి కీలకమని డాక్టర్ వద్దె వెంకటేశ్వర్లు అన్నారు.

- 8లో

**రంజాన్ వేళలు**

| | | |
|---|---|---|
| ఇఫ్తార్ (సోమవారం సా॥) | 6-35 |
| సహర్ (మంగళవారం ఉ॥) | 4-48 |

## న్యూస్‌రీల్

### కాంగ్రెస్ 'పార్లమెంట్' ఇన్‌చార్జ్‌లు వీరే..

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏఐసీసీ ఇన్‌చార్జ్‌లు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, తెలంగాణ ఇన్‌చార్జ్ దీపా దాస్ మున్షీ ఇన్‌చార్జ్‌లను ప్రకటించారు. నల్లగొండ, భువనగిరి పార్లమెంట్‌కు ఏఐసీసీ తరఫున ఇన్‌చార్జ్‌గా రోహిత్ చౌదరీని నియమించారు. నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని నియమించారు. భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని నియమించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించారు.

### బెట్టింగులపై నిఘా

సూర్యాపేట క్రైం: ఐపీఎల్ క్రికెట్ నిర్వహణ సందర్భంగా జిల్లాలో బెట్టింగ్‌లపై పోలీసు శాఖ నిఘా ఉంచిందని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్టింగ్ అనేది ఒక విష సంస్కృతి అని దీని వల్ల జీవితాలు ఆర్థికంగా నష్టపోయి కుటుంబాలు నాశనం అవుతాయని, బెట్టింగ్ సంస్కృతికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువత బెట్టింగ్ మాఫియా మాయలో పడవద్దని ఎస్పీ కోరారు. బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ప్రత్యక్ష బెట్టింగ్‌లపై నిఘా ఉంచామన్నారు. పౌరులను, యువతను, విద్యార్థులను ఎవరైనా బెట్టింగులకు ప్రోత్సహించినా, బెట్టింగులు పెట్టడానికి ప్రలోభాలకు గురిచేసిన అలాంటివారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత యొక్క నడవడికపై ఆర్థిక పరమైన అవసరాలపై గమనిస్తూ ఉండాలని కోరారు. బెట్టింగ్‌లకు పాల్పడే వారి, బెట్టింగ్ నిర్వాహకులు, మధ్యవర్తులు ఎవరైనా ఉంటే వారి సమాచారం స్థానిక పోలీసు అధికారులకు డయల్ 100కు, సూర్యాపేట జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ సెల్ నెంబర్ 8712686026కు సమాచారం ఇవ్వాలని కోరారు.

### బీసీలకు న్యాయం చేయాలి

మద్దిరాల : అత్యధిక శాతం ఉన్న బీసీలకు ప్రభుత్వం న్యాయం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మట్ట రాజు యాదవ్ అన్నారు.ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేవలం 10శాతం మాత్రమే ఉన్న ఓసీ సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ, 70శాతం జనాభ ఉన్న బీసీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తున్నదని అన్నారు. ఓసీ కార్పొరేషన్ పెట్టినట్లుగానే ప్రతి సామాజిక వర్గానికి చెందిన బీసీలకు కూడా వారి కులాల వారీగా ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి బీసీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టిపెల్లి మల్లేష్ యాదవ్, ఉపేందర్, వెంకన్న, రవి, తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా లక్ష కుంకుమార్చన



పూజల్లో పాల్గొన్న మైహోం చైర్మన్ రామేశ్వరరావు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని స్థానిక మైహోం సిమెంట్ పరిశ్రమ నందుగల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆరాధనా కార్యక్రమం, ధ్వజా రోహణం, సహస్రకమలార్చన, లక్ష కుంకుమార్చన, మంగళశాసనం, ఎదుర్కోలు, హనమద్వాహన సేవ ,తీర్థ ప్రసాద వినియోగాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మైహోం సిమెంట్ పరిశ్రమ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతులు మునగాల రామ్మోహనరావు, అరుణ దంపతులు, పరిశ్రమ హెడ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలంకరణతో వధూవరులుగా అలంకరించి, ఎదుర్కోళ్ల మహోత్సవం జరిపించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగల్యధారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్ ,ఈఓ నవీన్‌కుమార్, లక్ష్మణాచార్యులు, బదరీ నారాయణా చార్యులు పాల్గొన్నారు.

# పరిశీలిస్తూ.. భరోసానిస్తూ

సూర్యాపేట జిల్లాలో ఐదుగంటల పాటు సాగిన బీఆర్‌ఎస్ అధినేత పర్యటన



తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో రైతు ధరావత్ సురేష్‌తో మాట్లాడుతున్న కేసీఆర్



తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో కేసీఆర్ ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న మహిళా రైతు గుగులోతు సుశీల

- వెలుగుపల్లి, ఎర్కారం గ్రామాల్లో ఎండిన పంటల పరిశీలన
- కేసీఆర్ ఎదుట సమస్యలు ఏకరువుపెట్టిన అన్నదాతలు
- అధైర్యపడవద్దు అండగా ఉంటానని హామీ

తుంగతుర్తి, తిరుమలగిరి, సూర్యాపేట రూరల్: పంటలు ఎండిపోయిన అన్నదాతలకు గులాబీ బాస్ భరోసా ఇచ్చారు. ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న వారికి నేనున్నానంటూ ధైర్యం చెప్పారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు ఆదివారం చేపట్టిన సూర్యాపేట జిల్లా పర్యటన ఐదు గంటలకు పైగా సాగింది. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి తుంగతుర్తి మండలంలోని వెలుగుపల్లి, సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామాల్లో ఎండిపోయి వరి పొలాలను ఆయన పరిశీలించారు. వెలుగుపల్లి శివారులో సింగారంతండా, మొండికుంటతండాల్లో రైతులు దయ్యాల వెంకటనారాయణ, ధరావత్ సురేష్, భూక్య శ్రీను, ఆంగోతు హర్జ, గుగులోతు సుశీల, ఎర్కారంలో మహిళా రైతు కొదమగుండ్ల వెంకటయ్య, కొదమగుండ్ల సరోజనమ్మతో మాట్లాడారు. పంటలకు నీరందుతుందా, కరెంట్ సక్రమంగా వస్తుందా, రైతు బంధు సాయం వచ్చిందా.. అని వారిని అడిగి తెలుసుకున్నారు. సాగులో ఎదురవుతున్న కష్టాలను రైతులు కేసీఆర్‌కు వివరించారు.చేతికొచ్చిన పంట పూర్తిగా ఎండిపోయిందని విలపించారు. ఎస్సారెస్పీ కాలువ ద్వారా గోదావరి జలాలు రావడంతో చెరువులు, కుంటలు నిండి సాగునీటికి కొదవలేకుండా ఉండేదన్నారు. ఈసారి కూడా యాసంగి సీజన్ ప్రారంభంలో కాలువకు నీటిని విడుదల చేయడంతో వరి వేశామన్నారు. తీరా పొట్టదశలో నీటిని విడుదలను నిలిపివేయడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కరెంట్ కోతలు కూడా తోడయ్యాయని వాపోయారు. పెట్టుబడి కూడా వెళ్లే పరిస్థితి లేదని చెప్పారు. ఎర్కారం గ్రామంలో మహిళా రైతు సరోజనమ్మ కేసీఆర్‌ను చూసి కన్నీటి పర్యంతమైంది. ఎనిమిదేళ్ల నుంచి సాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేదని, మళ్లీ కష్టాలు మొదలయ్యాయని వాపోయింది. సాగు చేసిన ఐదు ఎకరాల పొలం పూర్తిగా ఎండిపోయిందన్నారు.

**ఓపికతో సమస్యలు వింటూ..**

మధ్యాహ్నం ఒంటి గంటకు వెలుగుపల్లికి వచ్చిన కేసీఆర్.. ఎండిన పంటలను పరిశీలిస్తూ ఒక్కో రైతును పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. రైతులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని, అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లున్నా ఎత్తిపోయకుండా బీఆర్‌ఎస్ పార్టీని బదనాం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతుందన్నారు. చేతికున్న పది వేళ్లలో ఒక వేలికి దెబ్బ తగిలితే దానికి సర్జరీ చేసి అతికించుకోవడం లేదా.. అలాగే ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కుంగిపోయిన పిల్లర్‌ను బాగు చేసుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం వల్లనే వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కాళేశ్వరం, ఎస్సారెస్పీ ఆయకట్టును ఎడారిలా మార్చారని దుయ్యబట్టారు. కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందో అనే అక్కసుతో కాంగ్రెస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టుని నిష్ప్రయోజనం చేశారని పేర్కొన్నారు. గత నాలుగు ఏళ్లుగా ఎస్సారెస్పీ కాలువల ద్వారా కాళేశ్వరం నీటితో వరసగా రెండు పంటలకు నీళ్లు ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌దే అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేందర్‌రావు, రాజ్యసభ సభ్యుడు సంతోష్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, ఎంపీటీసీ కవిత, గుండగాని రాములు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

**కేసీఆర్ పర్యటన సాగింది ఇలా..**

- కేసీఆర్ ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రత్యేక బస్సులో తిరుమలగిరి సమీపంలోని ఈదులపర్రెతండా ఎక్స్ రోడ్డుకు వచ్చారు.
- 2గంటలకు వెలుగుపల్లికి చేరుకొని పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.
- 2.20కి వెలుగుపల్లి నుంచి సూర్యాపేటకు బయలుదేరి వెళ్లారు.
- 2.43కు సూర్యాపేట మండలం ఎర్కారం స్టేజీ వద్దకు చేరుకున్నారు.
- 2.45కు ఎర్కారంలో మహిళా రైతు కొదమగుండ్ల సరోజనమ్మ సాగు చేసిన వరి పొలాన్ని పరిశీలించారు.
- 2.57కు ఎర్కారం నుంచి బయలుదేరి 3.20కి సూర్యాపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు.
- క్యాంపు కార్యాలయంలో భోజనం చేసి 4.45 వరకు విశ్రాంతి తీసుకున్నారు.
- 4.50కి అక్కడి నుంచి కారులో బయలుదేరి బీఆర్‌ఎస్ కార్యాలయానికి 5 గంటలకు చేరుకున్నారు.
- 5.10 నుంచి 6.03 నిమిషాల వరకు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం తిరుగుపయనం అయ్యారు.



సూర్యాపేట మండలం ఎర్కారంలో రైతుతో మాట్లాడుతున్న కేసీఆర్



వెలుగుపల్లిలో కేసీఆర్‌కు తన కష్టాలు వివరిస్తున్న రైతు భూక్య శ్రీను

## ఉమ్మడి జిల్లా రైతులకు తీరని నష్టం



సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడుతున్న కేసీఆర్, చిత్రంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ బడుగుల,గుజ్జ దీపిక, కిశోర్, పల్లా, బొల్లం, చిరుమర్తి తదితరులు

- 4 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయింది
- ప్రభుత్వం తీరుతోనే రైతులు నష్టపోయారు
- సాగర్‌పై అడుగు పెట్టలేని పరిస్థితిని కాంగ్రెస్ తీసుకొచ్చింది
- పోరాటాలకు బీఆర్‌ఎస్ శ్రేణులు కార్యోన్ముఖులు కావాలి
- విలేకరులతో కేసీఆర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో రైతులకు తీరని నష్టం వాటిల్లిందని, రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనం వల్లే 3.5 లక్షల నుంచి 4 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ధ్వజమెత్తారు. సాగునీటి సరఫరాలో ప్రభుత్వ వైఫల్యం కారణంగానే రైతులు నష్టాల పాలయ్యారని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో, ప్రతి గ్రామంలో పంటలు ఎండిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఆదివారం సూర్యాపేటలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఇతర నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 15 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతే జిల్లాలోనే అత్యధికంగా ఎండిపోయిందన్నారు. ఆలేరులో, తుంగతుర్తి, సూర్యాపేట, సాగర్ ఆయకట్టు ఇలా అన్ని నియోజకవర్గాల్లో పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. తుంగతుర్తిలో 25 వేల ఎకరాలు, సూర్యాపేటలో 24 వేల ఎకరాలు ఎండిపోయిందని, ప్రతి ఊళ్లో 200- 400 ఎకరాలు ఎండిపోయిందన్నారు. సాగర్‌లో వాడుకోగలిగిన నీరు ఉన్నా, ప్రభుత్వం ప్రాజెక్టును కేఆర్‌ఎంబీకి అప్పగించి, ఆ కట్టమీదకు ఎక్కలేని పరిస్థితికి తెచ్చి అన్యాయం చేసిందన్నారు. గతంలో తమను నిలువరించినా ఆంధ్రా ఎక్కువ వాడుకుందని దబాయించి నీళ్లు ఇచ్చేవారమన్నారు. 18 పంటలకు రైతులుకు తాము నీరిచ్చామని, ప్రభుత్వ వైఫల్యంతో ఇప్పుడు నీరు రాక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని వివరించారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పట్టించుకుంటే రెండు యూనిట్లు అందుబాటులోకి వచ్చేవని, తద్వారా 1500 మెగావాట్ల సొంత విద్యుత్తు అందుబాటులోకి వచ్చేదన్నారు.

**బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్**

కేసీఆర్ పర్యటన ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆయన ప్రయాణించిన ప్రాంతాల్లో పార్టీ కార్యకర్తలు అడుగడుగునా నిరాజనం పలికారు. కేసీఆర్ వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కేసీఆర్ రైతులతో మమేకం కావడం, పార్టీ శ్రేణులను పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునివ్వడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాం నెలకొంది.

## నల్లగొండలో కాంగ్రెస్‌దే విజయం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్ : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌దే విజయమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మట్టపల్లిలో శనివారం నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని కోదాడ, హుజూర్ నగర్, సూర్యాపేట, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జున సాగర్, నల్లగొండ నియోజకవర్గాల నుంచి ఎండలను సైతం లెక్కచేయకుండా వేలాదిగా తరలి వచ్చి క్రమశిక్షణతో పాల్గొన్న నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వచ్చిన వారికి ఏ లోటుపాట్లు లేకుండా సౌకర్యాలు కల్పించిన వారికి ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రాష్ట్రంలోనే అతిపెద్ద మెజార్టీ వచ్చే విధంగా అందరం కలిసి కృషిచేద్దామని మంత్రి పేర్కొన్నారు.

## నేడు నల్లగొండకు కేటీఆర్

- ఉదయం ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరు
- మధ్యాహ్నం ముషంపల్లిలో ఎండిన పంటపొలాల పరిశీలన



నల్లగొండ: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రానికి రానున్నారు. ఉదయం 11.30గంటలకు హైదరాబాద్ రోడ్డులోని లక్ష్మీగార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజక వర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కార్యకర్తలు, నాయకులకు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపుపై దిశా నిర్దేశం చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు నల్లగొండ మండలం ముషంపల్లిలో ఎండిన పంట పొలాలను పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా రైతు గన్నెబోయిన మల్లయ్య, బోర్ల రాంరెడ్డి ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడుతారు. కేసీఆరే ముషంపల్లి గ్రామానికి ఆదివారం వెళ్లాల్సి ఉండగా పోలేకపోయారు. దీంతో కేటీఆర్ సోమవారం ముషంపల్లి గ్రామానికి వెళ్లేందుకు షెడ్యూల్ ఖరారు చేశారు.

## నేడు సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

నిడమనూరు: తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వకు సోమవారం నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిసింది. నల్లగొండ జిల్లాలోని పెద్దదేవులపల్లి, ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌లను నింపడానికి ఎడమకాల్వకు నీటి విడుదల చేయనున్నారని సమాచారం. ఈ మేరకు ఎన్‌ఎస్‌పీ అధికారులకు ఎస్సీ కార్యాలయం నుంచి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. మార్చిలోనే విడుదల చేయాల్సి ఉన్నా రైతులు పొలాలు ఉన్నందున తూముల వద్ద ట్యాంపరింగ్‌కు పాల్పడే అవకాశం ఉండడంతో అధికారులు కొద్ది రోజుల్లోనే విడుదల చేసి నిలిపివేశారు. ఇప్పుడు వరికోతలు దాదాపు పూర్తికావడంతో పంటలకు ఇబ్బంది ఉండదని ప్రభుత్వం ఆలోచన చేసి నీటి విడుదల చేస్తున్నట్లు తెలిసింది.

## లోక రక్షణార్థమే ఏసుక్రీస్తు పునరుత్థానం

మఠంపల్లి: లోక రక్షణార్థమే ఏసుక్రీస్తు శిలువగాబడిన పిదప మూడవరోజు పునరుత్థానం గావింపబడినాడని విచారణ గురువులు మార్టిన్ పసల పేర్కొన్నారు. మఠంపల్లిలోని శుభవార్త చర్చిలో ఆదివారం ఈస్టర్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈనెల 29న శిలువపై సమాధిగాబడిన రోజును గుడ్‌ఫ్రైడేగా, క్రీస్తు తిరిగి జన్మించడాన్ని (పునరుత్థానం)ఈస్టర్‌డే గా ప్రపంచమంతా పండుగ జరుపుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రార్థనలు, దివ్యపూజాబలి నిర్వహించి క్రైస్తవులకు ఈస్టర్ సందేశమిచ్చారు. కార్యక్రమంలో ఫాదర్ సాగర్‌రెడ్డి, వీవీహెచ్ బ్రదర్ వినోద్‌రెడ్డి, సుందరి పాల్గొన్నారు.



దివ్యపూజా బలి గావిస్తున్న విచారణ గురువులు

# పన్నుల వసూలు 80.31శాతమే !

- ముగిసిన ఆర్థిక సంవత్సరం
- పంచాయతీల్లో పన్నుల లక్ష్యం రూ. 11.60కోట్లు
- వసూలు చేసింది.. రూ.9.31 కోట్లు





దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పల్లెల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. ఇవి సకాలంలో వసూలైతే పల్లె ప్రగతి సాధ్యమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధులతో పాటు ఇంటి పన్నులు కీలకంగా మారాయి. ఈ దశలో ఉన్న వనరులు ఎలాగైనా రాబట్టుకోవాలనే ఉద్దేశంతో పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించిన అనుకున్న లక్ష్యం చేరలేదు. జిల్లాలో ఇప్పటివరకు 80.31 శాతం పన్నులు మాత్రమే వసూలయ్యాయి.

| | |
|---|---|
| గ్రామంచాయతీలు | 475 |
| ట్యాక్స్ వసూలు చేస్తున్న నివాసాలు | 2,57,718 |
| ఈ ఆర్థిక సంవత్సరం పన్ను | రూ. 11,03,97,876 |
| గత సంవత్సరం బకాయిలు | 56,03,420 |
| మొత్తం వసూలు లక్ష్యం | 11,60,01,296 |
| నేటి వరకు వసూలు | 9,31,67,020 |
| బకాయిలు | రూ. 2,28,27,472 |

**పన్ను వసూలు లక్ష్యం... 11,60,01,296**

గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లు సవాల్‌గా మారాయి. ఖజానా ఖాళీ అయి కార్మికులకు వేతనాలు, కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేని స్థితిలో ఉన్న గ్రామాలకు పంచాయతీల్లో వసులూ చేసే పన్నులే పెద్ద దిక్కు. జిల్లాలో జిల్లాలో 23 మండలాలు ఉండగా, 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2023- 24 ఆర్థిక సంవత్స రానికి సంబంధించి 2,57,718 నివాసాలకు ఆస్తి పన్నులు, పన్నేతర చార్జీల రూపంలో జిల్లాలో రూ.11,03,97,876 కోట్లు వసూలు చేయాలని అధికారులు లెక్క కట్టారు. గత ఆర్థిక సంవత్సర బకాయిలు రూ. 56,03,420 ఉండగా మొతత రూ. 11,60,01,296 లక్ష్యంగా నిర్దేశించారు.

**80.31 శాతం వసూలు**

ప్రతి ఆర్థిక సంవత్సరం మార్చి 31 నాటికి ఆస్తి పన్నులు వసూలు చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తారు. గ్రామల్లో ప్రత్యేక అవగహన కార్యక్రమాలు నిర్వహించి పన్నుల వసూలుకు కసరత్తు చేస్తారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో పన్నులు వసూలు చేయడంలో అధికారులు విఫలం చెందారు. రూ.11,60,01,296 లక్ష్యానికి రూ.9,31,67,020 కోట్లు పన్ను లు వసూలు చేశారు. ఇందులో గత ఆర్థిక సంవత్సర బకాయిలు రూ. 37,48,008 ఉండగా ఆ సంవత్సర పన్నులు రూ.8,94,19,012 ఉన్నాయి. ఇంకా రూ. 2,28,27,472 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు జిల్లాలోని 23 మండలాల్లో 80.31 శాతం పన్నులు వసూలైనట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

**ఖర్చు ఇలా..**

గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం, తాగు నీరు, వీధి దీపాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు తదితర పనుల నిర్వహణ కోసం పన్నుల రూపంలో వచ్చిన నిధులను ఖర్చు చేస్తారు. పల్లె ప్రగతి పనుల నిర్వహణ, ట్రాక్టర్, వాటర్ ట్యాంక్ నిర్వహణతో పాటు మల్టీపర్పస్ వర్కర్లకు వేత నాలను ఇచ్చేందుకే ప్రభుత్వం కేటాయించే నిధులు సరిపోతున్నాయి. పంచాయతీలకు ట్యాక్స్ రూపంలో వచ్చే ఆదాయం చిన్న, చిన్న పనుల నిర్వహణకు వినియోగించే అవకాశం ఏర్పడుతుంది. వంద శాతం పన్నులు వసూలయ్యేలా కృషి చేసి, గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించే బాధ్యత క్షేత్ర స్థాయి అధికారులపై ఉంది. కాని అనుకున్న లక్ష్యం చేరలేదు.

## క్లుప్తంగా

### చిన్నారిపై వీధి కుక్కల దాడి


గాయపడిన సాయిరిధి

సూర్యాపేట రూరల్: చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఈ ఘటన సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. వివరాలు.. పిల్లలమర్రి గ్రామానికి చెందిన చిలుక నాగరాజు కుమార్తె సాయిరిధి ఇంటి బయట ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. గాయాలపాలైన సాయిరిధిని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా ఇటీవల కూడా అదే గ్రామానికి చెందిన చందుపట్ల కృష్ణ కుమార్తెను కూడా కుక్కలు తీవ్రంగా గాయపర్చాయి.

### చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


మధు (ఫైల్)

పెద్దవూర: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పెద్దవూర ఎస్‌ఐ పి. వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండల పరిధిలోని బోయగూడెం గ్రామానికి చెందిన పోలేపల్లి గోపి(27), కటికల మధు(24) మార్చి 27వ తేదీన బైక్‌పై వెళ్తుండగా.. పెద్దవూర మండల కేంద్రం సమీపంలోని విశ్వనాథ్ స్పిన్నింగ్ మిల్లు వద్ద జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోపి, మధుకు తీవ్రగాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పోలేపల్లి గోపి అదేరోజు మృతిచెందాడు. తీవ్ర గాయాలైన మధును మెరుగైన చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కటికల మధుకు భార్య అమృత, రెండేళ్ల వయస్సున్న కుమారుడు ఉన్నారు. మృతదేహానికి నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

### జిలకరకుంటతండా చెరువు వద్ద చెలరేగిన మంటలు


దగ్ధమైన చెట్లు, ముళ్లపొదలు

అడవిదేవులపల్లి: మండలం పరిధిలోని జిలకరకుంటతండా చెరువు సమీపంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్ తాగి పడేయడంతో మంటలు ఎగిసిపడి ముళ్లపొదలు, చెట్లు దగ్ధమయ్యాయి. స్థానికులు గమనించి మిర్యాలగూడ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

### ఆటోను ఢీకొట్టిన టాటా ఏస్ వాహనం

- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

నల్లగొండ క్రైం: మునుగోడు నుంచి నల్లగొండకు వస్తున్న ఆటోను వెనుక నుంచి టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం నల్లగొండ మండలం రంగారెడ్డి నగర్ శివారులో జరిగిందని నల్లగొండ రూరల్ ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న చెడుబుద్ధి స్వామి, మునుగోటి స్వామి, మునుగోటి రమాదేవి, నారోజు శంకరాచారి గాయపడ్డారని, వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించగా శంకరాచారి మృతిచెందాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడి భార్య జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# యాదాద్రి ఆలయంలో భక్తుల రద్దీ


స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు


కొండపైన బస్టాండ్‌లో కిటకిటలాడుతున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, మాడ వీధులు, సత్యనారాయణస్వామి వ్రత మండపం, మెట్ల మార్గం, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, కొండపైన, కొండ కింద గల బస్టాండ్‌లు భక్తులతో నిండుగా కనిపించాయి. స్వామివారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామిని 40వేలకు పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ పూజలతో స్వామి వారికి నిత్యాదాయం రూ.67,62,214 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

#### కొండపై జర్మన్ హంగర్ టెంట్ ఏర్పాటు

యాదాద్రి ఆలయ ఉత్తర మాడ వీధిలో భక్తులకు నీడ కోసం ఆలయాధికారులు తాత్కాలిక అల్యూమినియం జర్మన్ హంగర్ టెంట్‌ను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వేళ ఎండ వేడిమికి భక్తులు ఇబ్బందులు పడుతుండడంతో ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఉత్తర మాడ వీధిలో తాత్కాలిక జర్మన్ హంగర్ టెంట్‌ను ఏర్పాటు చేయడంతో భక్తులకు వేసవిలో కొంత ఉపశమనం కలుగనుంది.


ఉత్తర మాడ వీధిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన జర్మన్ హంగర్ టెంట్

#### స్థానిక భక్తుల ఆవేదన

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనాల విషయంలో స్థానికులకు మళ్లీ పాత పద్ధతినే ఆలయ అధికారులు కొనసాగిస్తున్నారని యాదగిరిగుట్ట, ఆలేరు, భువనగిరి ప్రాంతాలకు చెందిన భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి శనివారం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు యాదాద్రి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు స్వామివారిని దర్శించుకునేందుకు చాలాకాలం నుంచి వస్తున్నారు. వీరందరిని తూర్పు ద్వారం నుంచి ఆలయంలోకి పంపించేవారు. కానీ ప్రధానాలయం ఉద్ఘాటన సమయంలో సుమారు నెల రోజుల పాటు స్థానిక భక్తులు స్వామిని దర్శించుకోకుండా అప్పటి ఈఓ గీతారెడ్డి, అధికారులు ఆంక్షలు విధించారు. కొంతకాలం స్థానిక భక్తులు ఆందోళనలు, నిరసనలు తెలుపడంతో తిరిగి తూర్పు ద్వారం నుంచి వెళ్లే విధంగా వెసులుబాటు కల్పించారు. కానీ శనివారం స్థానిక భక్తులు అధికంగా స్వామిని దర్శించుకునేందుకు తరలిరాగా.. ఆలయ అధికారులు, సిబ్బంది వారిని అడ్డుకొని, టిక్కెట్ ఉంటేనే దర్శనానికి రావాలని, లేదంటే ధర్మదర్శనం క్యూలైన్‌లో రావాలని సూచించారు. దీంతో స్థానిక భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఓ భాస్కర్‌రావు ఆంక్షలు పెట్టారని కొంతమంది అధికారులు భక్తులకు చెప్పారు. దీంతో స్థానిక భక్తులు ఈఓ భాస్కర్‌రావు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా.. ఆయన సంబంధిత ఆలయాధికారులకు ఫోన్ చేశారు. తాను ఆలయంలో ఎలాంటి ఆంక్షలు విధించలేదని, స్థానిక భక్తులకు గతంలో మాదిరిగానే దర్శనాలు ఉంటాయని భక్తులకు ఈఓ తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది స్థానికులను ఆలయ తూర్పు ద్వారం వద్ద అడ్డుకొని అవమానపరుస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

# తలవంచి చదివితేనే తలెత్తుకొని జీవిస్తాం

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ


మునిపంపులలో గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న వితలాచార్య, అశోక్‌తేజ తదితరులు

రామన్నపేట: తల ఎత్తకుండా చేసే సెల్‌ఫోన్ డ్రగ్స్ కంటే ప్రమాదమని, అదే పుస్తకాన్ని తలవంచి చదివితే తల ఎత్తుకొని జీవించేలా చేస్తుందని సినీగేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ అన్నారు. రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామంలో నూతనంగా నిర్మించిన భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం నూతన గ్రంథాలయ భవనాన్ని దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల వితలాచార్య ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సుద్దాల అశోక్‌తేజ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విజ్ఞానం అనేది తరగని సంపద అని, ఎందరో మహనీయులు పుస్తక పఠనం ద్వారా గొప్ప వ్యక్తులుగా ఎదిగారని అన్నారు. పిల్లలు గొప్పవాళ్లలాగా ఎదగాలంటే తల్లిదండ్రులు వారికి మానవ సంబంధాల గురించి నేర్పించాలని సూచించారు. పుస్తకాలు చదవడం ద్వారానే తాను ఈ స్థాయికి ఎదిగానని, 2950కి పైగా పాటలను రాయగలిగానని చెప్పారు. దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల వితలాచార్య మాట్లాడుతూ.. గ్రామీణ గ్రంథాలయాలు ప్రజలను చైతన్యపరిచే కేంద్రాలుగా పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలు అలంకారప్రాయంగా మిగిలిపోకుండా విద్యార్థులు, యువకులు, గృహిణులు పుస్తక పఠనం అలవరచుకోవాలని సూచించారు. ఆచార్య కూరెళ్ల గ్రంథాలయంలోని పుస్తకాల ద్వారా 11మంది విద్యార్థులు పీహెచ్‌డీలు సాధించారని, దాని స్ఫూర్తితో గ్రామీణ గ్రంథాలయాల ఏర్పాటుకు యువత ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. క్రెడాయ్ జాతీయ కార్యదర్శి గుమ్మి రాంరెడ్డి, అడిషనల్ ఎస్పీ మిర్యాల ప్రభాకర్ మాట్లాడుతూ.. సాధించాలనే కసి మనలో ఉన్నప్పుడే గమ్యాన్ని చేరుకోగలమని అన్నారు. విద్యావంతులు, ఉద్యోగులకు నిలయమైన మునిపంపుల గ్రామం ఇతర పల్లెలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌తేజ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. తొలుపునూరి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు, కల్లూరి మల్లేశం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, మెరా అధ్యక్షుడు గంటెపాక నర్సింహ, ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీ గాదె పారిజాత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గెలుపు.. దేశాభివృద్ధికి మలుపు

- సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న వర్రె వెంకటేశ్వర్లు

హాలియా: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం దేశాభివృద్ధికి కీలకమని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం హాలియా పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలైతే అవినీతి లేని పాలన అందుతుందన్నారు. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి వెలికి తీయాలన్నారు. సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించేందుకు మేధావులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి జీఓను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడంతో పాటు ఆన్‌లైన్‌లో ఆర్టీఐ దరఖాస్తులు స్వీకరించేలా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విజన్‌ను ముందుకు తీసుకుపోయే విధంగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలన ఉందని తెలిపారు. మేధావులు, ఉద్యోగులు, జర్నలిస్టులు అందరూ ఏకతాటిపైకి వచ్చి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు బైరు సైదులుగౌడ్, జిల్లా అధ్యక్షురాలు హేమలత, రాష్ట్ర గౌరవ సలహాదారు కోటగిరి దైవాదీనం, నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రకాష్, పెద్దవూర మండల అధ్యక్షుడు మూల శేఖర్‌రెడ్డి, మండల నాయకులు ఇబ్రహీం, శ్రీనివాస్, బాలకృష్ణ, శోభన్‌బాబు తదితరులు ఉన్నారు.

# జాతీయ స్థాయి నాటక పోటీలు ప్రారంభం


మిర్యాలగూడ పట్టణంలోని రవీంద్రభారతిలో పద్య నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

మిర్యాలగూడ: పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపు కేసీఆర్ కళాభారతి(మినీ రవీంద్రభారతి)లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి పద్య, సాంఘిక నందిని నాటక ప్రదర్శన పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను జ్యోతి ప్రజల్వన చేసి హౌజింగ్‌బోర్డు శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ సూదిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది రఘురామారావు, చిలుకూరి శ్యాంప్రసాద్ ప్రారంభించారు. ఉదయం మయూరి ఆర్ట్స్ క్రియేషన్స్, వరంగల్ వారు 'ఉన్నది ఒక్కటే జీవితం' అనే నాటకాన్ని ప్రదర్శించగా.. మధ్యాహ్నం హైదరాబాద్‌కు చెందిన కళాకారులు నడత(క) సాంఘీక నాటకాన్ని ప్రదర్శించారు. అదేవిధంగా యంగ్‌మన్స్ హ్యాపీ క్లబ్, కాకినాడ వారు మహావీర బభ్రువాహన పద్య నాటకం అద్భుతంగా ప్రదర్శించారు. తెలంగాణ డెమొక్రటిక్ అసోసియేషన్, వరంగల్ వారు ప్రదర్శించిన మహారాణి రుద్రమాదేవి పద్య నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బోయినపల్లి భుజంగరావు, ప్రధాన కార్యదర్శి పులి కృష్ణమూర్తిశర్మ, కోశాధికారి పుల్లభట్ల లక్ష్మీనారాయణశర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి రామావతారం, ప్రచార కార్యదర్శి మామిడాల ఉపేందర్, వెంకట్, శ్రీనివాస్‌రావు, సాయిజీ, బాబురావుతో పాటు మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

### బారులుదీరిన వాహనాలు

బీబీనగర్: మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాహనాలు బారులుదీరాయి. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి వచ్చిన భక్తులు కొత్తగా నిర్మితమైన స్వర్ణగిరి క్షేత్రాన్ని చూసేందుకు భారీగా తరలివచ్చారు. దీంతో గూడూరు టోల్‌ప్లాజా నుంచి భువనగిరి ఎల్లమ్మ గుడి వరకు వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. టోల్‌ప్లాజా వద్ద ఫాస్టాగ్ స్కానింగ్ ఆలస్యం కావడంతో వాహనాలు బారులుదీరాయి. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి 10గంటల వరకు స్వర్ణగిరి ఆలయం నుంచి గూడూరు టోల్‌ప్లాజా వరకు 3కిలోమీటర్ల మేర భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

దేవరకొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి దేవరకొండ మండల పరిధిలో జరిగింది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. చందంపేట మండలం బొల్లారం గ్రామానికి చెందిన నేనావత్ అశోక్(20) బైక్‌పై తన సోదరి మౌనికతో కలిసి దేవరకొండ నుంచి స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో డిండి వైపు నుంచి వస్తున్న ఆటో దేవరకొండ మండల పరిధిలోని మైనంపల్లి బ్రిడ్జి సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశోక్, మౌనికను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ అశోక్ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి బంధువు నేనావత్ శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

# ఫామ్‌హౌజ్‌కు రండి మాట్లాడుకుందాం

- వాసాలమర్రి గ్రామస్తులకు సూచించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్


వాసాలమర్రి గ్రామస్తులకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

తుర్కపల్లి: ఎండిన పంటలను పరిశీలించడానికి ఆదివారం ఉదయం జనగాం, సూర్యాపేట జిల్లాల పర్యటనకు వెళ్లిన కేసీఆర్.. తిరుగు ప్రయాణంలో ఎర్రవల్లిలోని తన ఫాంహౌజ్‌కు వెళ్తూ తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో ఆగారు. గ్రామస్తులు రోడ్డుపై నిల్చొని జై తెలంగాణ.. జై కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తుడడంతో కేసీఆర్ వారిని చూసి తన కాన్వాయ్ ఆపారు. మాజీ సర్పంచ్ ఆంజనేయులు దంపతులతో పాటు మరికొందరు కేసీఆర్‌కు పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారితో కాసేపు ముచ్చటించారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. కాళేశ్వరం కాలువల్లో నీళ్ల వస్తున్నాయా.. కరెంట్ ఎట్ల వస్తుంది.. ఎంత సేపు వస్తుంది.. అని రైతులను, మాజీ సర్పంచ్ పోగుల ఆంజనేయులును అడిగారు. కాలువల్లో నీళ్లు రావడం లేదని, కరెంట్ సరిగ్గ రావడం లేదని, బోర్లు, బావులు ఎండిపోయాయని వారు కేసీఆర్‌కు తెలియజేశారు. రైతుబంధు అందరికీ వస్తుందా అని అడగగా చాలా మందికి రాలేదని చెప్పారు. కల్యాణలక్ష్మి డబ్బులు కూడా వస్తలేవని చెప్పారు.

#### ఇళ్లు కూలిపోతున్నాయి సారూ..

ఇళ్లు కూలిపోతున్నాయి.. ఇళ్లు కట్టిస్తామని మీరు అప్పట్లో చెప్పింద్రుగా సారూ.. ఆశతో ఉన్నామని వాసాలమర్రి గ్రామస్తులు కేసీఆర్‌తో అన్నారు. ఇందుకు కేసీఆర్ స్పందిస్తూ ఫాంహౌజ్‌కు రావాలని, అక్కడ ఊరి గురించి అన్ని విషయాలు మాట్లాడుకుందామని, ఎప్పుడు రావాలో తానే చెబుతానని కేసీఆర్ పేర్కొన్నారు. అనంతరం ఫాంహౌజ్‌కు వెళ్లిపోయారు. కేసీఆర్ ఆగిన సమయంలో మాజీ ఉపసర్పంచ్ పలుగుల మధు, గ్రామస్తులు కొండ మల్లేశ్, పలుగుల వాణి తదితరులు ఉన్నారు.

### ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం


నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

పాలకవీడు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామలింగేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల సందర్భంగా శనివారం రాత్రి గ్రామంలో ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్య నాటకం ఆకట్టుకుంది. శ్రీరామ కల్యాణ మండపం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నాటక ప్రదర్శనను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. లోహితుడి పాత్రలో పగడాల రిత్విక్ నటించగా.. వివిధ పాత్రల్లో పగడాల మట్టేష్, పెరుమాల రాములు, బుర్రి చంద్రయ్య నటించారు.

# ప్రత్యేక మత్స్య సొసైటీ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ముదిరాజ్ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకనబోయిన రమణ

బీబీనగర్ : మండలంలోని గూడూరు గ్రామ చెరువుకు సంబంధించి ప్రత్యేక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని ముదిరాజ్ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకనబోయిన రమణ ముదిరాజ్ కోరారు. ఆదివారం బీబీనగర్ మండలంలోని గూడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ మత్స్యకారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భువనగిరి మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో గూడురు చెరువు కొనసాగుతుందని, కానీ తమకు ప్రత్యేక సొసైటీ కావాలని గ్రామంలోని మత్స్యకార కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా అధికారులను వేడుకుంటున్నారని తెలిపారు. భువనగిరి మత్స్య సొసైటీ పాలకవర్గ మండలి స్పందించి గూడూరు గ్రామంలోని చెరువు మత్స్య సొసైటీ ఏర్పాటుకు సహకరించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఆయన కోరారు. సొసైటీ ఏర్పాటుకు గ్రామంలోని ముదిరాజ్ మత్స్యకార కుటుంబాలు సమావేశమై ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాముల అశోక్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిట్టబోయిన రమేష్, తుపాకీ మహేష్, అంకర్ల శ్రీనివాస్, శ్రీకాంత్, అశోక్, తుపాకీ రాజు, శేఖర్, దశరథ, రాములు, భాస్కర్, పెంటయ్య, శ్రీను, పాండు, బాలరాజు, రాజేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

### ఐదు తరాల కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో చింతల కుటుంబ సభ్యులు

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన కీ.శే.చింతల రామచంద్రారెడ్డి–రాధమ్మ దంపతుల కుటుంబ సభ్యులు ఆదివారం చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలోని ఆందోల్ మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. దాదాపు 30 సంవత్సరాల తర్వాత ఐదు తరాలకు చెందిన 150 మంది కుటుంబ సభ్యులు ఒకే చోట కలుసుకుని ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. ఎవరికి ఏమి వరుస అవుతారో పరిచయాల ద్వారా తెలుసుకున్నారు. ఆప్యాయంగా పలుకరించుకుని ఆనందంగా గడిపారు.

### కేసీఆర్ పర్యటనలో సొమ్మసిల్లి పడిపోయిన జెడ్పీటీసీ సభ్యుడు


సొమ్మసిల్లి పడిపోయిన జెడ్పీటీసీ సభ్యుడు వీరప్రసాద్‌యాదవ్

అర్వపల్లి: తుంగతుర్తి నియోజకవర్గంలో ఎండిపోయిన పంటల పరిశీలనకు ఆదివారం మాజీ సీఎం కేసీఆర్ పర్యటించిన నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తూ అర్వపల్లిలో జాజిరెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు దావుల వీరప్రసాద్‌యాదవ్ వడదెబ్బతో సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే పార్టీ శ్రేణులు ఓ దుకాణంలోకి తీసుకెళ్లి కొద్దిసేపు సీపీఆర్ చేశారు. ఆ తర్వాత ప్రథమ చికిత్స చేసి సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.



### అన్నదాతకు అండగా..


సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామంలో పంట ఎండిపోయిన రైతులతో మాట్లాడుతున్న కేసీఆర్


వెలుగుపల్లిలో మాజీ సీఎం కేసీఆర్‌కు ఎండిపోయిన పంటను చూపేందుకు వచ్చిన రైతులు


వెలుగుపల్లిలో పంటల పరిశీలనకు వెళ్తున్న కేసీఆర్, ఎంపీ బడుగుల


సూర్యాపేట మండలం ఎర్కారంలో కేసీఆర్‌కు తమ గోడు వెల్లబోసుకుంటున్న రైతులు, చిత్రంలో ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి